పల్లె ఆరోగ్యానికి భరోసా

- గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యసేవలు

పాలకోడేరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గతంలో మెరుగైన వైద్యసేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి. ఆర్థికస్తోమత లేనివారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 104, 108 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రస్తుతం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. పాలకోడేరు మండలం గొరగనమూడి, ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం, కాళ్ల మండలం పాతర్ల మెరక తదితర గ్రామాల్లో క్లినిక్‌లను ప్రారంభించి సేవలు పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. మిగిలిన చోట్ల అందుబాటులో ఉన్న భవనాల్లోనే వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రతి 2,500 మంది జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. క్లినిక్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ ఉండి సేవలందిస్తారు.



పాలకోడేరు మండలం గొరగనమూడిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్


మోగల్లులో పక్షవాతంతో మంచంపై ఉన్న రోగి ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ రంగమనాయుడు

ఇంటి వద్దకే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దే వైద్యం అందుతోంది. ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు వైద్యులు, సిబ్బంది సందర్శించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపి చూస్తున్నారు. ఆ తర్వాత మంచంపై ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్న ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు.

ప్రతి నెలా మందులు ఇస్తున్నారు

నాకు పక్షవాతం. నేను బయట తిరగలేను. వైద్యం కోసం గతంలో పట్టణాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్లి చికిత్సలు తీసుకునేవాడిని. ప్రస్తుతం వైద్యులు ఇంటి వద్దకే వస్తున్నారు. అవసరమైతే రక్త పరీక్షలు చేస్తున్నారు. వెంటనే మందులు అందిస్తున్నారు. నెలకు రెండుసార్లు సరిపడా మందులు ఇస్తున్నారు.

– గుబ్బల భద్రమ్మ, మోగల్లు

గ్రామంలోనే వైద్యసేవలు



మా గ్రామంలో ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసింది. దీంతో మాకు ఏ అత్యవసర వైద్యం, సమస్యలు వచ్చినా హెల్త్ క్లినిక్‌లోనే వైద్య సిబ్బంది వెంటనే సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి నెలా రెండు సార్లు 104 వాహనంతో వైద్యులు గ్రామంలోకి వస్తున్నారు.అక్కడే రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసరం అయినప్పుడు 108 వాహనంలో పట్టణాలకు తీసుకువెళ్తున్నారు. – చిల్లా అనూష, సర్పంచ్, పెన్నాడ

హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేసి రికార్డుల్లో నమోదు చేస్తున్నాం. ప్రతి గ్రామానికి రెండు సార్లు 104 వాహనంతో వెళ్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలోనే ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 105 రకాల మందులు హెల్త్ క్లినిక్‌లో అందుబాటులో ఉన్నాయి. రోజూ అన్ని హెల్త్ క్లినిక్‌ల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య అందిస్తున్నాం. – సీహెచ్ రంగమనాయుడు, వైద్యాధికారి

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం డిపో పరిధి 5 మండలాల్లో ఉన్న ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు సూచనలు, సలహాలను సెల్ నెంబర్: 99592 25485కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడిచేసి 6గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,030 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు: పేకాట స్థావరంపై దాడిచేసి 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. విస్సాకోడేరు గ్రామ శివారులో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,460 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను భీమవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.

అక్రమ మద్యం కలిగిన వ్యక్తి అరెస్టు

ఆకివీడు: స్థానిక శ్రీనగర్ కాలనీలో అక్రమ మద్యం కలిగిన ఉన్న శనగన వెంకటేశ్వరరావును గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు. అతని వద్ద నుంచి 180 ఎంఎల్ బాటిళ్లు 4, బీరు బాటిళ్లు 4 స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

క్లుప్తంగా

మృదుల కుమారికి స్త్రీ శక్తి పురస్కారం


చర్ల మృదుల కుమారి

భీమవరం: కస్తూరిబా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర సర్వోదయ మండలి చర్ల మృదుల కుమారిని స్త్రీ శక్తి పురస్కారానికి ఎంపిక చేసినట్లు మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లానుంచి గాంధేయ మహిళ మృదుల కుమారిని ఎంపిక చేసి సర్వోదయ మండలి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 16న పురస్కారం అందజేయనున్నట్లు చెప్పారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు


హర్షం వ్యక్తం చేస్తున్న కళాశాల పాలకవర్గం, సిబ్బంది

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ చెప్పారు. తమ కళాశాలకు మూడేళ్లకు గానూ ఎన్‌బీఏ గుర్తింపు రావడం అరుదైన రికార్డు అన్నారు. డిసెంబర్ నెలలో ఎన్‌బీఏ బృందం కళాశాలకు విచ్చేసి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని గుర్తింపునిచ్చిందన్నారు. అనంతరం ఆయన కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, వివిధ విభాగాల హెడ్స్, డీన్స్‌ను అభినందించారు.

మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



సెమినార్‌లో మాట్లాడుతున్న సిద్దీఖ్

భీమవరం: దేశ భవిష్యత్ యువత, విద్యార్థుల పైనే ఆధారపడి ఉంటుందని, అయితే సమాజంలో చాలా మంది సిగరెట్, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని మోటివేషనల్ స్పీకర్ ఆప్కా సిద్దీఖ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యాన 'రండి! మత్తు రహిత సమాజాన్ని స్థాపిద్దాం' రాష్ట్రస్థాయి అవగాహన ఉద్యమంలో భాగంగా గురువారం భీమవరం పీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్, జమాతే ఇస్లామి హింద్ పట్టణాధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, ఎస్ఐఓ పట్టణాధ్యక్షుడు ముహమ్మద్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): సహచరులకు ఆదర్శంగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగులను అధికారులు అభినందించారు. జనవరి నెలలో అత్యధిక కేఎంపీఎల్ సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన డ్రైవర్లు ఎస్‌వీఎస్ఏ రావు, కేవీ రావు, ఎస్ఏ నారాయణలను భీమవరం డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యాన అభినందించారు. అత్యధిక ఆదాయం తెచ్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కండక్టర్లు వి.రాంబాబు, కె.శ్రీరాములు, టీవీఎస్‌ఎం లక్ష్మిలను అభినందించి రూ.500, రూ.400, రూ.300 నగదు చెక్కులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన సర్పంచులు


జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాలకోడేరు మండల సర్పంచ్‌లు

పాలకోడేరు: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అజిత వేజెండ్లను పాలకోడేరు మండల సర్పంచులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. భీమవరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి మొక్కను అందించారు. ఎస్పీని కలిసిన వారిలో మండల సర్పంచుల సంఘం కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, శృంగవృక్షం సర్పంచ్ జంగం సూరిబాబు, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, విస్సాకోడేరు ఎంపీటీసీ బొల్లం గాంధీ తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో వార్ వన్‌సైడే

- 175 స్థానాల్లోనూ విజయం వైఎస్సార్ సీపీదే
- ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్న జగనన్న పథకాలు
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వార్ వన్‌సైడే, ఫ్యాన్ గాలి బలంగా ప్రజల్లో వీస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలతో యుద్ధానికి దిగాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల అండదండలతో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైనాట్ 175 అన్న జగన్ మాటల్ని ప్రజలు నిజం చేయనున్నారన్నారు. కూటమిలు ఎన్ని వచ్చినా ప్రజల హృదయాల్లో జగన్ సుస్థిర స్థానం సంపాదించారన్నారు. టీడీపీ కంచుకోటలుగా చెప్పుకుంటున్న నియోజకవర్గాలు బీటలువారి కుప్పకూలనున్నాయని నర్సింహరాజు అన్నారు. వచ్చే ఎన్నికలు మరో సునామీని సృష్టిస్తాయని, ప్రతిపక్షాల అడ్రస్సు గల్లంతవుతుందన్నారు. గత 57 నెలలుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసి న పథకాలు ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని మార్చివేశాయన్నారు. పేదోడు లక్షాధికారిగా ఎదిగాడన్నారు. ప్రతి కుటుంబం రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి పొందిందన్నారు. సీఎం జగన్ తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో పేదోడి పిల్లలు సాఫ్ట్‌వేర్లు, డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదిగారని, వారి కుటుంబాలు ఆర్థికంగా, ఆనందంతో గడుపుతున్నాయని చెప్పారు. రైతన్నల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. పండిన పంటను కళ్ల వద్దే కొనుగోలు చేసి, రైతు కష్టాన్ని బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ పరిపాలనలోనూ అన్నదాతలు ఆనందంగా గుప్పెడు ముద్ద మింగిన దాఖలాలు లేవని పీవీఎల్ చెప్పారు. నిరుద్యోగులు లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. 30 ఏళ్ల టీడీపీ పాలనలో 30 వేల ఉద్యోగాలు వేసిన దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. అక్కచెల్లెమ్మలు తమ కాళ్లపై తామే నిలబడేలా డ్వాక్రా గ్రూపుల్ని బలోపేతం చేశారన్నారు. డ్వాక్రా రుణమాఫీ పథకం ఆసరా ద్వారా ప్రతి అక్కచెల్లెమ్మ లక్షల సొమ్ము సొంత చేసుకున్నారన్నారు. చేయూత, కాపు నేస్తం పథకాల ద్వారా మహిళల ఖాతాల్లో వేలాది రూపాయల సొమ్ము జమ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని చెప్పారు. మూడు దశాబ్దాలుగా పేదలకు అంగుళం భూమి ఇవ్వలేని ప్రభుత్వాలు పేదల సొంత ఇంటి కల నెరవేరితే కళ్ల కుట్టేలా విమర్శలు చేస్తున్నారని నర్సింహరాజు ధ్వజమెత్తారు. మురికివాడల్లో తరతరాలుగా జీవనం గడుపుతున్న కటిక పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని పీవీఎల్ చెప్పారు. నవరత్నాలు, 95 శాతంకు పైగా మ్యానిఫెస్టో అమలు చేసి, చెప్పిన, చెప్పని పథకాల్ని కూడా ప్రజలకు అందించిన జగన్ ప్రతిపక్షాలతో వచ్చే ఎన్నికల్లో యుద్ధం చేయాల్సిన అవసరం ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు దుష్టపన్నాగాలు పని ఒకటైనా ప్రజల అండదండలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని నర్సింహరాజు అన్నారు.

వేగంగా గ్రామాల్లో అభివృద్ధి


సీసీ డ్రెయిన్ పనులను పర్యవేక్షిస్తున్న కళ్యాణ్ వర్మ

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో అభివృద్ధి వేగంగా సాగుతోంది. సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణంతో గ్రామం అభివృద్ధిలో మిగిలిన గ్రామాలతో పోటీ పడుతోంది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికాగా, ఇప్పుడు ఉండి రాజులపేట, పడవలరేవు, ఉండితోట, కోం ద్రోతుపేట ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం ప్రారంభమైంది. గురువారం రాజులపేటలో ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ ఆధ్వర్యాన రూ.10లక్షల జెడ్పీ నిధులతో సీసీ డ్రెయిన్ పనులను ప్రారంభించారు. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యాన నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు సుమారు రూ.100 కోట్లతో నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేయాలి


డ్రైవర్లకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

భీమవరం: విద్యాసంస్థల్లో విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తే ప్రమాదాల నివారణకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా రవాణాశాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యాన గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో రోడ్డు ప్రమాదాల్లో యువతే 80 శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్ల తీవ్ర గాయాలు పాలుకావడం, మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాస్ మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. అనంతరం కళాశాల వాహన డ్రైవర్లకు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో రవాణాశాఖాధికారులు సీహెచ్ వెంకటేశ్వరరావు, కేఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణచైతన్య పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

భీమవరం: ప్రణాళికతో చదివితే విజయం తప్పక లభిస్తుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యాన స్థానిక త్యాగరాజ భవనంలో గ్రూప్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ముందుగా అభినందనలు తెలిపారు. అనంతరం పరీక్షల పట్ల దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ, ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం లక్ష్మణరావు సిద్ధం చేసిన గ్రూప్స్ మెటీరియల్‌ను 250 మంది అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీఆర్ఎల్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ శ్రీవాణి, ఎస్‌వీకేపీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహారాజు, యూటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రామకృష్ణ, భవాని ప్రసాద్, జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, పవన్ కుమార్, నాయకులు జి.శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మోషేన్‌రాజు పరామర్శ


జామి శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ఆకివీడు: నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు జామి శ్రీనివాస్‌ను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు గురువారం పరామర్శించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళిని మండలి చైర్మన్ పరామర్శించారు. ఇటీవల మురళి తండ్రి కృష్ణమూర్తి మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మురళి సోదరుడు దిలీప్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, జి.ధనరాజు, తోట శివాజీ, గేదల అప్పారావు, ఎరిచర్ల గ్లాడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అతిరుద్ర మహాయాగం


కవిటంలో యాగ మహోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల

పోడూరు: కవిటం గ్రామంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహా విద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల దంపతులు పాల్గొన్నారు. యాగమహోత్సవాలకు విచ్చేసిన ఉమాబాల దంపతులకు వేదపండితులు ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. యాగమహోత్సవాల్లో భాగంగా వేదపండితులు రుద్రహోమం, అరుణ హోమం, చండీ హోమం, ఈశ్వరునికి రుద్రపారాయణల అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి శ్రీ జ్ఞాన ప్రసునాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ), సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి (అబ్బు), ఎంపీటీసీ కుక్కల సూర్యనారాయణ, మేడపాటి రామారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, బాలాజీ రెడ్డి , మండ కాశీవిశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం



డీఎల్‌డీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 5వ వార్డు గంటాలమ్మగుడి వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 5 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. వశిష్ట వంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టలను కొలిక్కి తీసుకొచ్చామని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. పట్టణంలో రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్ ఆధునికీకరణ, పార్కుల అభివృద్ధి జరిగాయన్నారు. నియోజకవర్గంలో కమ్యూటిటీ హాల్స్ నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు.

డీఎల్‌డీవో కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని 24వ వార్డులో రూ.6 లక్షలతో నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని ముదునూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, కౌన్సిలర్లు కావలి రామసీత, పతివాడ పద్మ, జిల్లెళ్ల దిలీప్, గోరు సత్తిబాబు, బి.విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, కావలి నాని పాల్గొన్నారు.

వైభవంగా పెద్దింటమ్మ కల్యాణోత్సవం


అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గ్రామ దేవత పెద్దింటి అమ్మవారి వార్షిక కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవోపేతంగా జరిగింది. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని, శక్తీశ్వరస్వామిని పెండ్లి కూతురు, పెండ్లి కుమారుడిగా అలంకరించి కల్యాణం చేశారు. కల్యాణంలో పలువురు దంపతులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

యలమంచిలి: మండల పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ చెప్పారు. మేడపాడులో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో గ్రామ సమస్యలన్నింటికీ పరిష్కారం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, మాజీ ఉప సర్పంచ్ గంధం సత్యకీర్తి, హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ముద్దల గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

17న వలంటీర్లకు సన్మానం

పాలకోడేరు: గ్రామ వలంటీర్లను ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా సన్మానిస్తున్నట్టు ఎంపీడీవో టి.అనూహ్య తెలిపారు. ఈనెల 17వ తేదీన పాలకోడేరు మండల సమాఖ్య భవనంలో పాలకోడేరు, కొండేపూడి, వేంద్ర, గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోని వలంటీర్లను, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, శంగవృక్షం గ్రామాల్లోని వలంటీర్లను 22వ తేదీన శంగవృక్షం ఆర్యవైశ్యుల కళ్యాణ మండపంలో సన్మానిస్తామని, ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతారని ఎంపీడీవో చెప్పారు.